విద్యార్థులందరికీ కానుక



పామిడి: విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ వీరాంజనేయులు



గుంతకల్లుటౌన్: ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్యాగ్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని



గుత్తి: మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కిట్ల పంపిణీ..

గుంతకల్లుటౌన్: పేదల ఇళ్లల్లో విద్యా దీపాలు వెలగాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని తెలిపారు. సోమవారం ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువే మనం పిల్లలకిచ్చే అతి పెద్ద ఆస్తి అన్నారు. పిల్లలు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ ఎం.రంగన్న, పాఠశాల హెచ్‌ఎం సావిత్రమ్మ, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- గుత్తి: పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ జరిగింది. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, ఎంఈఓ రవి నాయక్, హెచ్‌ఎం ఉష తదితరులు విద్యార్థినులకు విద్యా కానుక కిట్లను అందజేశారు. 9వ వార్డు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సూర్య ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు అందజేశారు.
- శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వెంకటరాముడు తెలిపారు. సోమవారం మండలంలోని వెస్ట్ నరసాపురం జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమన్న, డీలర్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- యల్లనూరు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 2,871 మంది విద్యార్థులకు 14,610 నోటు పుస్తకాలు, 2,146 బెల్టులు, 2,871 బ్యాగులు, 2,779 షూ, 5,558 సాక్స్, 647 డిక్షనరీలు, 16,316 పాఠ్యపుస్తకాలు, 4,979 వర్కు పుస్తకాలు అందజేశామన్నారు.
- పెద్దవడుగూరు: మండల పరిధిలోని లక్ష్ముంపల్లి జెడ్పీ పాఠశాలలో సోమవారం విద్యాకానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో సుమారు 8 మంది విద్యార్థులు పది పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించారని పేర్కొన్నారు.
- గుంతకల్లు: ప్రభుత్వ విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ బి.మాధవి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నెలగొండ జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.మోహన్‌రావు, నియోజక వర్గ సోషల్ మీడియా కన్వీనర్ జయరామిరెడ్డి, హెచ్‌ఎం హరిప్రసాద్‌రెడ్డి, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ షబ్బీర్ బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.
- నార్పల: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థినులు బాగా చదువుకోవాలని సూచించారు. ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల కమిటీ చైర్మన్ పల్లె బాలకృష్ణారెడ్డి, నాయకులు మన్నీల శివయ్య, కాఫీపాడి రాజు, నాగరాజు, మోహన్, ఉపాధ్యాయురాళ్లు నవీదా, నాగలక్ష్మి, ప్రవీణ పాల్గొన్నారు.
- పుట్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభం రోజే విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట, తొండపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురు మస్తాన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాముయాదవ్, హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయుడు శ్రీధర్‌గౌడ్, పీసీ కమిటీ చైర్మన్ నాగభూషణం, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు పురుషోత్తం పాల్గొన్నారు.
- తాడిపత్రి: మండలంలోని ఆలూరు ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ సరస్వతి, వైస్ ఎంపీపీ శ్రీదేవి తదితరులు విద్యాకానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. సజ్జలదిన్నె ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సర్పంచ్ నీరజ, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె నాగరాజు తదితరులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 555 మార్కులు సాధించిన విద్యార్థి నరేష్‌కు వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె నాగరాజు, సర్పంచ్ నీరజతో కలసి రూ.2 వేల సాయం అందజేశారు. అలాగే యర్రగుంటపల్లి ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామాంజినేయులు, ఉపాధ్యాయులు సునీత, లావణ్య, లత తదితరులు విద్యా కానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిషోర్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జ్యోతి పాల్గొన్నారు.
- పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు అన్నారు. పట్టణంలోని 1వ వార్డు స్కూల్ విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని, ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. అలాగే ఎంఈఓ జయానాయక్ పర్యవేక్షణలో మండల వ్యాప్తంగా 46 పాఠశాలల్లో 4,919 మంది విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పసుల నాగరాజు, సర్పంచులు, ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీఆర్ పనులు పూర్తి చేయండి



మేఘ కంపెనీ ఎండీ కృష్ణారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: మేఘ ఇంజినీరింగ్ అండ్ వర్క్స్ కంపెనీ ఎండీ కృష్ణారెడ్డిని సోమవారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హైదరాబాద్‌లో కలిశారు. గుత్తి, పామిడి పట్టణాల్లో శాశ్వత తాగునీటి పరిష్కారానికి చేపట్టిన ఎంపీఆర్ (మిడ్ పెన్నార్ రిజర్వాయర్) పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సుమారు రూ.1.75 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. ఇందుకు ఎండీ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని బదులిచ్చారు.

పంటల పరిశీలన



సాగు వివరాలను తెలుసుకుంటున్న ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం లక్ష్మానాయక్

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట, బొందలదిన్నె గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను సోమవారం ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం లక్ష్మానాయక్ పరిశీలించారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు పలదా మార్కెటింగ్ సంస్థ ముందుకు వచ్చినట్లు తెలిపారు. నాణ్యతను పరిశీలించిన అనంతరం పంటలను కొనుగోలు చేస్తారన్నారు. అనంతరం సత్యసాయి జిల్లాలో పలువురు రైతులు సాగు చేస్తున్న పంటలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో పలదా ఆర్గనైజేషన్ టీమ్ సీఎంఎస్ శాస్త్రి, సిద్దనా గౌడ, జిల్లా కో–ర్డినేటర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు నాలుగు వినతులు

యల్లనూరు: గ్రామీణ ప్రాంతాల్లో వివిధ సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై నాలుగు వినతులు వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూతో పాటు ఇతర శాఖల సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రామకృష్ణుడు, హౌసింగ్ ఏఈ సుప్రజ, పంచాయతీరాజ్ ఇంజినీరు నరేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'రీ సర్వే'తో భూములకు రక్ష



రాయలచెరువులో రీసర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ అలెగ్జాండర్

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ అలెగ్జాండర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాయల చెరువులో రీ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో కుందనకోట, ఓబుళాపురం, తిమ్మాపురం, తూట్రాళ్లపల్లె, రాయలచెరువు తదితర రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకూ 3,598.44 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. రైతులు ప్రతి ఒక్కరూ దగ్గరుండి రీసర్వే చేయించుకోవాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సైతం పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినదన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, మండల సర్వేయర్ సుంకన్న, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

తొట్టెలను శుభ్రంగా ఉంచుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుత్తి: పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది మలేరియా మాసోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ.. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లోని సామాన్లు, ముఖ్యంగా తొట్టెలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

తాడిపత్రి డిపోను ఆదర్శంగా నిలపాలి



ఆదర్శ ఉద్యోగులకు నగదు చెక్కులు అందజేస్తున్న ఆర్టీసీ డీఎం శంకర్

తాడిపత్రి అర్బన్: ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎల్. శంకర్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపించి తాడిపత్రి డిపోను ఆదర్శంగా నిలపాలన్నారు. మే నెలకు సంబంధించి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లో అత్యధిక ఈకేపీ సాధించిన కండక్టర్లు, అత్యధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లకు నగదు బహుమతులు అందజేశారు. అలగే ప్రశంసా పత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ నందిని, ఏఎం (ఈ) సత్యనారాయణ, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న ఏడీఏ వెంకట్రాముడు

గుత్తి రూరల్: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపేట, తురకపల్లి, కరిడికొండ గ్రామాల్లోని ఆర్‌బీకే సిబ్బందితో వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 2023–24 సీజన్‌లో ఎరువులు, పురుగుల మందులను గ్రామాల్లో రైతులకు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విత్తనం వేసినప్పటి నుంచి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో గుత్తి హబ్ మేనేజర్ కృష్ణ భగవాన్, ఎంపీఈఓలు మేరి, మానస, షారోన్, వీఏఏ, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న కిమ్స్ సవేరా వైద్యుడు రాము నాయక్

యాడికి: గ్రామాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు సూచించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కొలుపల్లె, బూరుగుల, నేరెడుచెర్ల కొమ్మెమర్రి గ్రామాల నుంచి దాదాపు 200 మంది వైద్య పరీక్షలకు హాజరయ్యారు. గుండె నొప్పి, గుండె దడ, ఆయాసం, కీళ్ల నొప్పులు, గుండెలో మంట కలగటం, జ్వరంతో బాధపడుతున్న వారికి కిమ్స్ సవేరా వైద్యులు రాము నాయక్, సిబ్బంది సుమ, మంజు, ఆసుపత్రి మేనేజర్ సురేష్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆరోగ్యశ్రీ, పథకం ద్వారా ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, నాయకులు రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సిగ్గులేని బీజేపీని నమ్మరాదు'

గుంతకల్లు: నాలుగేళ్లుగా కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు ముఖ్యమంత్రి జగన్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని పొగిడారు. అయితే నేడు విమర్శించడం ఎంత వరకూ సమంజసమని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు టీసీ నారాయణరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బీజేపీ నేత నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జగన్ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వమని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఏపీలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల కోట్లను దుర్వినియోగం చేశారని చెప్పడం శోచనీయమన్నారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను ఏ మాత్రం అమలు చేయని బీజేపీ ప్రభుత్వం జగన్‌ను విమర్శించడం హాస్యాస్పందంగా ఉందని ఎద్దేవా చేశారు.

చిరుధాన్యాల సాగుపై నేడు అవగాహన

శింగనమల: మండలంలోని సీ.బండమీదపల్లి ఆర్బీకేలో మంగళవారం డివిజన్ స్థాయి చిరుధాన్యాల సాగు విస్తరణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ అన్వేష్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023ను పురస్కరించుకుని జొన్నలు, రాగులు, కొర్రల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జేసీ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. రైతులందరూ అవగాహన సదస్సుకు హాజరుకావాలని కోరారు.

కాలువ పనులు త్వరగా పూర్తి చేయండి



వరద కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: వరద కాలువ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని హెచ్చెల్సీ అధికారులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశించారు. చాగల్లు ప్రాజెక్టు నుంచి ఏ.కొండాపురం వరకూ రూ.14 కోట్ల వ్యయంతో జరుగుతున్న వరద కాలువ నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో కాలువ నిర్మాణ పనులను కొంతమేర చేపట్టి వదిలేశారన్నారు. అయితే సీఎం జగన్ కాలువ పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించారని తెలిపారు. కాలువ నిర్మాణం పూర్తయితే పెద్దపప్పూరు, పుట్లూరు మండలాల్లోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని అక్కడి అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన రైతులను అడిగి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు తాను అందుబాటులో ఉంటానని ఎటువంటి సమస్యవచ్చినా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎం జగన్ పాలనలో సకాలంలో వర్షాలు కురవడంతో పాటు చాగల్లు, పెండేకల్లు, ముచ్చుకోట ప్రాజెక్టులకు నీరు వదలడంతో బోర్లలో నీరు సమృద్ధిగా వస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ జేఈ హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి

పామిడి: మండలంలోని పాళ్యంతండా గ్రామంలో సోమవారం నాటుసారా స్థావరాలపై గుత్తి సెబ్ సీఐ వరలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 120 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యల్లనూరు: మండల కేంద్రంలో బస్టాండు నుంచి మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

బీకేఎస్ సీఐగా నాగార్జున రెడ్డి



బుక్కరాయసముద్రం: బుక్కరాయసముద్రం సీఐగా నాగార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న రాము ఇటీవల ఏసీబీ కేసులో చిక్కుకుని సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల బాధ్యతల స్వీకరణ

యల్లనూరు: సాధారణ బదిలీల్లో భాగంగా మండలానికి కొత్తగా 20 మంది ఉపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం వారు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారన్నారు. అలాగే మరో 10 మంది ఉపాధ్యాయులు మండలంలోనే ఇతర పాఠశాలలకు బదిలీ అయినట్లు పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



గుత్తి: ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



తాడిపత్రి అర్బన్: నినాదాలు చేస్తున్న విద్యార్థులు



గుంతకల్లుటౌన్: ర్యాలీ చేపట్టిన పోలీసులు

గుంతకల్లుటౌన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అందరూ నడుం బిగించాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మిక, పోలీస్, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వన్‌టౌన్ పీఎస్ నుంచి మొదలైన ర్యాలీ పొట్టిశ్రీరాములు సర్కిల్ వరకూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న అమ్మఒడితో పాటు జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా బాల కార్మికులను గుర్తించి వారిని స్కూళ్లల్లో చేర్పించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐ నరేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పావతి, షాహిదా, కార్మికశాఖ సిబ్బంది సంధ్య, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్లు బాలాజీ, భాగ్యలక్ష్మి, మహిళాశిశు సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ఓ సామాజిక బాధ్యత అని తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్ లేబర్ ప్రాజెక్టు, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అశోక్ పిల్లర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. విద్యాహక్కు చట్టం సంపూర్ణంగా అమలు చేయడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరస్వతి, ఎంపీడీఓ రంగరావు, లేబర్ అధికారి ప్రతాప్‌నాయుడు పాల్గొన్నారు.

గుత్తి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని సీడీపీఓ డిల్లీశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవీంద్రనాథ్, ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలో సోమవారం ప్రపంచ బాల కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు, మోటర్ మెకానిక్‌లు ఉమ్మడిగా ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి, నినాదాలు చేశారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, 1098 చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ బాలాజీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1.60 లక్షలతో నీటి ట్యాంకుల ఏర్పాటు



నీటి ట్యాంకులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫయాజ్ బాషా

తాడిపత్రి అర్బన్: వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశామని హీరాపురం ఫయాజ్ బాషా తెలిపారు. మెయిన్ బజార్‌లోని జామీయా మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన ట్యాంకులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెయిన్ బజార్‌లోని జామీయా మసీదు సమీపంలో ఫయాజ్ బాషా ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు రూ.1.60 లక్షల వ్యయంతో బోర్లు వేయించి రెండు ట్యాంకులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ట్రస్టు ద్వారా సేవలు అందించి ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నీటి ట్యాంకులు ఏర్పాటు చేసిన ఫయాజ్ బాషాను మహిళలు అభినందించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, కౌన్సిలర్లు హాజీవలి, రియాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్, డీవీ కుమార్, వరదలయ్య, ఇ.శ్రీరాములు, బాబు, గురుప్రసాద్‌రెడ్డి, అస్లాం, జునైద్, ఆలూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.71 కోట్ల పంట నష్ట పరిహారం మంజూరు

నార్పల: ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు మండల వ్యాప్తంగా ఉద్యాన పంటలు దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.71 కోట్ల నష్ట పరిహారం మంజూరు చేసిందని హెచ్ఓ ఫజులిన్నీసా బేగం సోమవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 831 మంది అరటి రైతులు, నలుగురు బొప్పాయి రైతులు, 17 మంది టమాట రైతుల ఖాతాల్లో రూ.1.71 కోట్ల పరిహారాన్ని జమ చేసినట్లు పేర్కొన్నారు.

మార్కెట్ యార్డులో చీనీ కాయలు వేలం వేయాలి

గార్లదిన్నె: అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ కాయలు బహిరంగ వేలం వేయాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మర్తాడులో వారు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన చీనీ పంటను అమ్ముకోవడానికి గుంటూరు మార్కెట్‌కు తరలివెళ్తున్నారన్నారు. మార్కెట్‌లో పబ్లిక్ వేలం వేయాలని పలు మార్లు ఆందోళన చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం చలో గుంటూరు పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి, ఫక్రుద్దీన్, తాతయ్య, రామలింగయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.